క్లుప్తంగా

అవార్డుకు ఎంపిక



భూపాలపల్లి రూరల్: ప్రతీ ఏటా బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక సేవ సంఘ సంస్కర్తలకు అందిస్తున్న అవార్డులలో భాగంగా భారత జాగృతి దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కుమారస్వామి గౌడ్ నేషనల్ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ శనివారం హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రికను అందజేసినట్లు కుమారస్వామి తెలిపారు. సంఘ సేవ ద్వారా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి తనను సేవా రత్న నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. అవార్డును ఈనెల 15న ఢిల్లీలో నిర్వహించే ఆలిండియా బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అందించనున్నట్లు తెలిపారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



మహదేవపూర్: మండల కేంద్రంలో గ్రీన్‌ఉడ్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళ ఉపాధ్యాయులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చీర్ల శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



మహదేవపూర్: మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర హాస్టల్‌ను ఎంపీడీఓ రవీంద్రనాథ్ శనివారం తనిఖీ చేశారు. ఉదయం విద్యార్థులకు అందించే అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని వార్డెన్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములుగు రూరల్ : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన ములుగు మండలంలోని జంగాలపల్లి వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం గ్రామానికి చెందిన దిగిని కుమార్, లక్ష్మి దేవిపేట గ్రామానికి చెందిన గోస్కుల బన్నీ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై హనుమకొండ నుంచి వెంకటాపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో జంగాలపల్లి వద్ద వాహనం అదుపుతప్పి కింద పడడంతో మిత్రులిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108 వాహనంలో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానవత్వం చాటిన సీఐ

చిట్యాల: రోడ్డు వెంట ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యభర్తలను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో భాగంగా అటుగా వెళ్తున్న సీఐ వేణుచందర్ వారిని చూసి పోలీస్ సిబ్బందితో స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నాడు. సకాలంలో స్పందించిన సీఐని గ్రామస్తులు అభినందించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: మందులు అందజేస్తున్న వైద్యాధికారి



ఏటూరునాగారం: పరీక్షిస్తున్న వైద్యాధికారులు

ఏటూరునాగారం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని వీరాపురం బోజేర్వు గొత్తికోయగూడెంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరం గ్రామంలోని 24మందిని పరీక్షించి, వారికి మందులను పంపిణీ చేశామని తెలిపారు.

వైద్యశిబిరం

వాజేడు : మండల పరిధిలోని ఆరుగుంటపల్లిలో శనివారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం రోగులను పరీక్షించి మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. స్థానిక ఎంపీపీ శారద, వైద్యాధికారి మహేందర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యశిబిరంలో ఇచ్చిన మెడికల్ కిట్లలో పంపిణీ చేసిన మందులను ఎలా వాడాలో తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, మండల కోఆర్డినేటర్ కామేష్, కోటిరెడ్డి, శ్రీను, లలిత, హనుమంతు, ప్రశాంత్, నరేష్, ఇందిర తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రాజేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి : రెండో విడత గొర్రెల పంపిణీలో యాదవులను బీఆర్ఎస్ మోసం చేసిందని యాదవ సంఘం మండల అధ్యక్షుడు పాక రాజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాదవుల ఆర్థికాభివృద్ధికి గొర్రెలను పంపిణీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్ మొదటి విడతలో వంద మందిలో నాలుగు, ఐదు గురికి మాత్రమే పంపిణీ చేసి చేతుల దులుపుకున్నారని ఆరోపించారు. మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రెండోవిడత గొర్రెల కోసం డీడీలు చెల్లించి ఆరు నెలలు దాటిన ఇంతవరకు గొర్రెలు పంపిణీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మండలంలో సుమారుగా వంద మంది యాదవులు రూ. 40వేలు డీడీ చెల్లించామని గొర్రెలు పంపిణీ చేసేందుకా లేకా ఎన్నికల ఖర్చు కోసమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో అప్పులు తెచ్చి డీడీలు చెల్లించిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గొర్రెల పంపిణీ సాధ్యం కాకపోతే లబ్ధిదారులకు నగదు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, యాదవులు చెవుల మల్లేష్, అడ్డాల దేవేందర్, అడ్డాల మహేష్, కట్ల ఓదెలు, మూసిక లింగాలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద శ్రీనివాస రావు

వాజేడు : మండల పరిధిలోని అరుణాచలపురం పోలింగ్ కేంద్రాన్ని నోడల్ అధికారి శ్రీనివాస రావు శనివారం సందర్శించి, కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ఏర్పాటు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

‘ఓటమి భయంతో నీచ రాజకీయాలు’



ఆందోళన చేస్తున్న ఎంపీపీ, కాంగ్రెస్ శ్రేణులు

కాటారం: ఓటమి భయంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పుట్ట మధు అనుచరులు నియోజకవర్గంలో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యారంటీ స్కీం ప్రచార ఫ్లెక్సీలను చించివేయడంపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాటారం మండలం గంగారం క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. కాటారం–మంథని రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు వస్తున్న ఆదరణను బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీం అంశం ప్రజలను ఆకట్టుకోవడాన్ని తట్టుకోలేక దుశ్చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై–2 సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అనంతరం ఫ్లెక్సీలు చించిన దుండగులను వెంటనే పట్టుకొని శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు నవీన్ రావు, చీర్ల తిరుపతిరెడ్డి, పసుల మొగిలి, శ్రీకాంత్ నాయక్, కుంభం రమేశ్‌రెడ్డి, ముత్తయ్య ఉన్నారు.

కల్వర్టుల తనిఖీ



తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ బృందం

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ఆలుబాక శివారు నుంచి యాకన్న గూడెం గ్రామం వరకు వెంకటాపురం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు, బాంబ్ డిస్పోజల్ బృందం ఆధ్వర్యంలో కల్వర్టులను తనిఖీ చేశారు. అలాగే ఎదిర గ్రామపంచాయతీ వరకు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై గల కల్వర్టులను రోడ్డును బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేపట్టారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న రామయ్య

మల్హర్: మండలంలోని నాచారం గ్రామాల్లో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, టీషర్ట్‌లను సర్పంచ్ రామయ్య క్రీడాకారులకు ఆదివారం అందజేశారు. గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పల్లెల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాల ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన స్పోర్ట్స్ కిట్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అభినవ్

కాటారం: శాంతిభద్రతలకు విఘాతం కల్గించకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాటారం ఎస్సై అభినవ్ సూచించారు. మండలంలోని గుమ్మాళ్లపల్లిలో శనివారం ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీసీ కెమెరాల ఆవశ్యకత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. పలు అంశాలపై ఎస్సై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర చాలా ముఖ్యం అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, గ్రామంలో నిత్యం జరిగే సంఘటనలు సీసీ కెమెరాల ద్వారా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్‌శాఖ, అధికారులకు సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామంలో ఎలాంటి రెచ్చగొట్టె కార్యక్రమాలకు పాల్పడొద్దని, ఐక్యతతో ముందుకెళ్లి అభివృద్ధి సాధించుకోవాలని సూచించారు. గ్రామాలపై నిరంతర పోలీస్ నిఘా ఉంటుందని చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎస్సైతో పాటు సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ములుగు : జిల్లా కేంద్రంలోని అన్ని కాలనీలకు సీసీ రోడ్లు నిర్మిస్తామని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ప్రగతి కాలనీలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుల్లె ఓదేలు, భాస్కర్, కొండ రవి, సుభాష్, మూడు కస్నా సింగ్, శ్రీదేవి, స్థానికులు పాల్గొన్నారు.

వసూలు చేసిన సొమ్ము దళితులకు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ కుమార్

వెంకటాపురం(కె) : భద్రాచలం నియోజకవర్గంలో దళితబంధు పేరుతో వసూలు చేసిన సొమ్మును తిరిగి దళితులకు ఇవ్వాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, వెంకటాపురం ఎంపీపీ చెరుకూరి సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం ఆవరణలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం సంకా హేమ సుందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో దళితబంధు ఇప్పిస్తామని అమాయక దళితుల వద్ద ఎమ్మెల్యే అనుచరులు డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. దళిత బంధు లిస్టులో పేర్లు లేక పోయే సరికి దళితులు లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి జల్లిగంపల లక్ష్మీపతి, యువజన మోర్చా మండల అధ్యక్షుడు శ్రీ కిషన్, మహిళ మోర్చా అధ్యక్షురాలు అంకాల దుర్గ, నాయకులు సురేష్, రవి, నవీన్ తదితరులు ఉన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేశ్, పోలీసులు

వాజేడు : గుడుంబాను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేశ్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా గుడుంబా తెచ్చి విక్రయిస్తున్న వ్యక్తులను తహసీల్దార్ ఎదుట శనివారం ఎస్సై బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో సోదాలు చేయగా అల్లి సునీత, ఎక్కెల పద్మ వద్ద గుడుంబా లభించగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. గ్రామస్తులకు గుడుంబా విక్రయించొద్దని అవగాహన కల్పించామన్నారు. గుడుంబా తాగితే ప్రాణాలు పోతాయని, కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచించారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ‘స్వచ్ఛతా హీ సేవా’



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని సీఆర్‌పీఎఫ్ ఎఫ్–39 బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పిచ్చిమొక్కలతో పాటు చెత్త చెదారాన్ని తొలగించి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రశస్తు, ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని పలు వార్డుల్లో జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబి, బీఆర్ఎస్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వలియాబి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని అన్నారు. మహిళలు పండుగ సంబురాలను వైభవంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

‘ఆశ’ల సమస్యలు పరిష్కరించాలి

ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆశ కార్యకర్తల సమస్యలపై స్పందించకపోతే సమరభేరి మోగిస్తామని ఆశ వర్కర్ల యూనియన్, సీఐటీయూ జిల్లా నాయకుడు గుండెబోయిన రవిగౌడ్, చుంచు మంజుల అన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా 13వ రోజు జిల్లా కేంద్రంలో దీక్షలను శనివారం రవిగౌడ్, మంజుల ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరికి ఆరోగ్య సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయకపోవడం సమంజసం కాదన్నారు. మంత్రులను, ఎమ్మెల్యేలను కలిస్తే దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని వేతనాలు ఆశ కార్యకర్తలకు ఇస్తున్నామని చెప్పడం తగదన్నారు. అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలోనే ప్రజా ప్రతినిధులందరికి ఎక్కువ వేతనాలు ఇస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఆశ వర్కర్లకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో రమాదేవి, కవిత, సుజాత, మంజుల, సారలక్ష్మి, శిరీష, యశోద, మల్లిక, పూల పాల్గొన్నారు.

‘కాళేశ్వరం’ను మండలం చేయాలి



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో జాతీయ రహదారి 353(సీ) పలుగుల బైపాస్ రోడ్డు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాలు, ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్న పుణ్యక్షేత్రమైన కాళేశ్వరాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం, మెట్‌పల్లి, పలుగుల, మద్దులపల్లి, చంద్రుపల్లి, అన్నారంతో పాటు కాటారం మండలంలో పలు గ్రామాలను కలుపుతూ మండలంగా ఏర్పాటు చేస్తు ప్రభుత్వం ఎన్నికల ముందే ఉత్తర్వులు ప్రకటించి ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని పేర్కొన్నారు. మండలంగా ఏర్పాటు చేస్తే చిన్న గ్రామాలకు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. కాళేశ్వరం టూరిజం హబ్‌గా మారే అవకాశం ఉందని అన్నారు. కాగా అక్కడి పోలీసులు చేరుకొని ధర్నాను విరమింపజేశారు. గంటపాటు వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈధర్నాలో నాయకులు బందెల సత్తమ్మ, మంచినీళ్ల దుర్గయ్య, లేతకరి రాజబాపు, సంతోష్, మెంగాని అశోక్, కామిడి శ్రీనివాసరెడ్డి, శకీల్, లక్ష్మన్, అరుణ్,గోర శ్రీకాంత్, సురేష్, ఆనంద్, రాజు, గణపతి, ఫరీద్, అస్లాం, సాగర్, మహేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం



గణపురంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నాడని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. మండలంలోని చెల్పూరు గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.30 లక్షలతో గ్రామపంచాయతీ అదనపు భవనం, రూ.30 లక్షలతో నిర్మించనున్న పార్కు పనులను ప్రారంభించారు. అలాగే పరుశరాంపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనం, రవినగర్‌లో రూ.15 లక్షలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అప్పయ్యపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించడంతో పాటు రూ.20 లక్షలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలకేంద్రంలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రూ.9.90 లక్షలతో నిర్మిస్తున్న వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. పలు గ్రామాల్లో బతుకమ్మ చీరల పంపిణీతో పాటు, కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలసాని లక్ష్మీనరసింహారావు, గణపురం పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రా రెడ్డి, గణపురం సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, చెల్పూరు సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, సర్పంచ్‌లు ఐలోని శశిరేఖ రాంచంద్రా రెడ్డి, మానసశ్రీనివాస్, ఎంపీటీసీలు అశోక్ రెడ్డి, శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



మహాముత్తారం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండాఎగరడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు అన్నారు. మాటా–ముచ్చట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సింగారం, స్థంబంపల్లి(పీకే)గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేక మయ్యారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాజు వెంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.